# మేలుమరువని కన్నీరు

— జొన్నలగడ్డ నాగభూషణరావు

రామం గాడికోసం నే నేంత సేపటినుంచీ ఎదురుచూస్తున్నానో నా నోటితో చెప్పక్కరలేదు.

గుట్టలా పేరుకుపోయిన సిగరెట్టు పీకలు, తద్వారా సంక్రమించి దట్టంగా అలుముకున్న గదిలోని పొగ వాతావరణం చూసి ఎవరైనా ఇట్టే పోల్చుకోగలరు.

అయినా అంతగా వాడికోసం అర్ధరాత్రి సమీపిస్తున్నా కాచుకు కూర్చోవడానికి కారణం, ఆరు నెలల తరువాత మే మిద్దరం తిరిగి కలుసుకోవడ మొకటే కాదు.

ఒకరంటే ఒకరికి ఆరో ప్రాణం కిందే లెక్క.

వైజాగ్‌లో పుట్టి పెరిగిన మేము చెడ్డీలు తొడుక్కుని, చేగోడీలు తింటూ కబుర్లు చెప్పుకునే రోజుల నుంచీ చిరంజీవిలా పర్సనాల్టీలు పెంచుకొని చెరొక పీ. జీ. డిగ్రీ చేత పుచ్చుకుని. ఉద్యోగరీత్యా చెరొక ఊరూ విడిపోయేవరకూ ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకోకపోయినా ఒకళ్ళంటే ఒకళ్ళం పడిచచ్చేవాళ్ళమంటే మటుకు మీరు నమ్మితీరవల్సిందే!

కామర్స్ చదివిన నేను విజయవాడ విజయా బాంక్‌లో సెటిలయితే, తెలుగు లిట్ చేసిన రామం కాకినాడ కాలేజీలో లెక్చరర్‌గా సెటిలయ్యాడు.

వాడికి సాహిత్యంతో పాటు చిన్నప్పటి నుంచీ సరస శృంగార ప్రియత్వం కూడా బాగానే అబ్బింది అని చెప్పకపోతే, నేను వాడి పట్ల అన్యాయం చేసినట్లవుతుంది.

అలాని వాడు తిరుగుబోతూ, పొగరుబోతూ కాదు సుమా.

అందం ఎక్కడ ఉన్నా ఎవరిలో ఉన్నా ఆనందిస్తాడు. ఆరాధిస్తాడు. కానీ ప్రతిదాన్నీ సొంతం చేసుకుని అనుభవించాలని మాత్రం భావించడు.

'బ్యూటీ ఈజ్ టు సీ అండ్ ఎంజాయ్. బట్ నాట్టు స్టాయిల్' అన్నది వాడి సిద్ధాంతం.

అంగుకే వాడంటే నాకు ప్రత్యేకమైన అభిమానం.

అలాంటి రామంగాడూ, నేనూ కలిసి ఎన్ని ఊళ్ళు తిరిగినా, ఉద్యోగరీత్యా విడిపోయినా ఈ ఆరు నెలల తరువాత మొదటిసారిగా వాడు నా గెస్ట్‌గా వస్తున్నాడంటే, నా మనసులో ఏదో అనిర్వచనీయమైన అలౌకికానంద తరంగం ఎద కవాటాలను తట్టి లేపుతున్నట్లనిపిస్తోంది.

ఈ రోజు రాత్రి ఎనిమిది గంటలకల్లా నీ ముందుంటానని లెటర్ రాశాడు.

ఎవరో ఫ్రెండ్ కారులో వస్తున్నానని రాయబట్టి ఇలా రూములో వెయిట్ చేయవలసి వచ్చింది కానీ, లేకపోతే రైల్వే స్టేషన్‌కి పోయి రిసీవ్ చేసుకుని వచ్చేవాడిని కానూ!

కానీ చెప్పిన టైముకన్నా మరీ ఇంత లేటవుతుంటే మనవాడు గానీ ఏలీసెంట్ రోడ్‌లోనో ఓ డీసెంట్ ఫిగర్ కనబడగానే అమాంతం సౌందర్యోపాసన పేషెంట్‌గా మారిపోయి, అక్కడే మజిలీ గానీ చెయ్యటం లేదు గదా అన్న అనుమానం కూడా మొదలయ్యింది.

సరిగా ఆ అనుమానం బీజం మొక్కగా మొలకెత్తుతున్న క్షణంలోనే ఊడిపడ్డాడు రామం ఒక చేతిలో బ్రీఫ్‌కేస్‌తో, మరో చేతిలో సిగరెట్టుతో.

కళ్ళజోడు సవరించుకుంటూ - "అరేయ్ శ్రీ! [శ్రీకాంత్ అనబడే నన్ను వాడికి అలా పిలవడమే అలవాటు లెండి] అప్పనంగా ఛాన్స్ దొరికింది గదానీ నా స్టూడెంట్ ఫాదర్ ఒకాయన లిఫ్ట్ ఇస్తానంటే ఆయన కార్లో కూర్చున్నానా, తీరా సగం దూరం వచ్చేసరికి ఫ్రంట్ టైర్ పంక్చర్. సర్లే అని టైరు మార్చుకుని మరో గంట ప్రయాణం చేసేసరికి ఇంజన్ ట్రబుల్. చచ్చీ చెడీ దాన్ని దార్లోకి తెచ్చి ఇదిగో ఇప్పు డొస్తున్నాం.". ఆలస్యానికి కారణం అడక్కుండానే చెప్పేశాడు.

అప్పటికి గానీ నాకు వాడిమీద ఏర్పడబోతున్న అలక చిలకలా ఎగిరిపోయి, అభిమానం తిరిగి మొలకెత్తలేదు.

ఇంకా అలా గుమ్మంలోనే నిలబడి పఫ్ మీద పఫ్ కొడుతున్న వాడి చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకుంటూ - "మొత్తానికి చాలా కష్టపడి వచ్చావులే గానీ లోపలికి అఘోరించు" అన్నాను.

అయినా వాడికి నా మాట చెవిలో దూరినట్లు లేదు.

గుమ్మంలోంచే అలా ఎదురింటి కిటికీవైపే చూస్తూ - "అవును గానీ ఒరేయ్ శ్రీ! ఆ ఎదురింటి ఎలనాగ ఎవర్రా? ఆ అందం నన్ను తినేస్తోందిరా. అలా కిటికీ వద్ద నిలబడి ఏ లోకాలలోకో చూస్తున్నట్లున్న ఆమె చూపులు చూస్తుంటే నా కేమనిపించిందో తెలుసా 'ప్లీజ్! నన్ను లేవుకుపోరూ!' అన్నట్లుగా ఉన్నాయిరా..."

ఇంక ఆపైన వాడేం చెప్పేవాడో గానీ నా చేతి నాలుగు వేళ్ళు ఎర్రగా ఉన్న వాడి కుడి బుగ్గమీద తేలిపోయి, చెంప ఛెళ్ళు మని కందడంతో ఊహించని ఆ హఠాత్ పరిణామానికి వాడి కళ్ళలో నీళ్ళు నుళ్ళు తిరిగి నోట్లో సిగరెట్టు కింద పడింది.

ఉన్నట్టుండి అలా కొడతానని వాడే కాదు అసలలా కొట్టగలనని నేను కూడా అనుకోలేదు.

అయినా రామం ఏమాత్రం తొణక్కుండా నా చెయ్యి పుచ్చుకుని తనే నన్ను మెల్లగా లోనికి నడిపించుకువెళ్ళాడు.

ఎదురుబదురు కుర్చీల్లో కూర్చున్నాం.

"శ్రీ! నన్ను కొట్టావని నువ్వేం బాధపడకు. నీ దెబ్బ నాకు శరీరంపైనే తగిలింది. కానీ గుమ్మంలోకి వస్తూనే నేను నాకు తెలియకుండానే నీ మనసుపైన ఎక్కడో నమ్మెటపోటు పెట్టి ఉంటాను. అందుచేత నువ్వు అలా ప్రవర్తించి ఉంటావని నేను భావిస్తున్నాను. కానీ అసలు విషయ మేమిటో నువ్వు చెప్పకపోతే మాత్రం నిజంగా నేను బాధపడతాను."

క్షణికావేశంలో వాడిమీద చెయ్యి చేసుకున్న నన్ను రామం ఎంత బాగా అర్థం చేసుకున్నాడు!

"సారీరా! టేక్ ఇట్ ఈజీ!" అంటూ మరో సిగరెట్టు ముట్టించాను.


వాడు కూడా సిగరెట్ నోట్లో పెట్టుకుని నా సిగరెట్‌తోనే ముట్టించుకున్నాడు.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి అప్పుడు దిగాను అసలు విషయంలోకి...

** ** **

"అందానికి అందం ఈ పుత్తడి బొమ్మా!" అన్న పాట బహుశా ఆ కవి ఈమెను చూసైనా లేక కలలో ఊహించుకునైనా రాశాడేమో ననిపిస్తుంది.

ఒక చక్కదనమే కాదు, అంతకన్న చక్కని గుణం.



చదువులో బెస్ట్.


ఆటల్లో ఫస్ట్.

మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన మచ్చలేని జాబిల్లి తునక.

విరిసీ విరియని ముద్దమందారం లాంటి ఆ అలినీలవేణి పేరు సౌజన్య!

పెళ్ళాడింది అందరిలాగే - తన భర్త ప్రయోజకుడే అన్న నమ్మకంతో పెద్దలు కుదిర్చిన సంబంధానికి శిరసావహించి.

నాలుగు సంవత్సరాలైనా కడుపు పండకపోయేసరికి మోడరన్ పిల్లలు కదా ప్లానింగ్‌లో ఉన్నారేమో అనుకున్నారు గానీ, సౌజన్య మెడలో మూడు ముళ్ళు బిగించిన మూర్తి ముండల ముఠాకోరే కాకుండా - ఆమెను నానారకాల శరీరక, మానసిక చిత్రహింసలకూ గురి చేస్తున్నాడని ఊహించలేకపోయారు.



మూర్తి చేసేది చెప్పుకోతగ్గ ఉద్యోగమే.

అయినా చెడు అలవాట్ల ఊబిలో పీకలదాకా కూరుకుపోయిన అతనికి ప్రతి రోజూ ఎక్కడైనా ఒక కురుక్షేత్రమే.

ఎవరినైనా తన్నడమో, లేక వాళ్ళ చేతుల్లో చావుదెబ్బలు తిని ఇంటికి రావడమో అతనికి మామూలే.

పైపెచ్చు చిన్న వయసులోనే అలవడిన సుఖరోగాలు.

ఒకసారి కాలు, చెయ్యి ఫ్రాక్చరయితే ఆ దెబ్బతోనైనా పాత అలవాట్లకు స్వస్తి చెబుతాడని ఆశించింది సౌజన్య.

కాలు, చెయ్యి వంకరపోయినా బుద్ధి వంకర పోలేదు.

మరింతగా అతనిలో కసి పెరిగింది.

ఫలితంగా ఆరు సంవత్సరాల సౌజన్య దాంపత్యానికి నూరేళ్ళు నిండాయి.

ఒళ్ళు గుల్లగా మారిన మూర్తి ఓనాడు విపరీతమైన కొట్లాటలో చిత్తుగా దెబ్బలు తిని శవంగా మారి ఇంటికి వచ్చాడు.

ఆమె పుట్టిల్లు కాకినాడే అయినా, అక్కడికి వెళ్ళి అయిన వాళ్ళందరికీ తన ముఖం చూపించలేక ఏదో ఉద్యోగ ప్రయత్నం చేస్తూ గత ఏడాదిగా ఈ పరిస్థితిలో ఇలానే ఉండిపోయింది.

కొడిగట్టిన దీపంలాంటి ఆమెను చూసినప్పుడల్లా ఆమె ఎవరో నాకు తెలియకపోయినా, ఏమీ కాకపోయినా ఒక తోబుట్టువు లాంటి అనురాగ భావం నాలో జీర్ణించుకుపోయింది.

అందుచేతే ఆమె చూపులకు నువ్వు అలా భాష్యం చెప్పేసరికి ఆలోచనారహితంగా నాకు తెలియకుండా నే నీమీద చెయ్యి చేసుకున్నాను. క్షమించరా రామం!'' అంటూ ఇంక ఆపైన ఏమీ మాట్లాడలేకపోయాను.

విషయమంత విని రామం కూడా చలించిపోయాడు.

తరువాత రెండు రోజులు మాత్రం ఎంతో సరదాగా ఇద్దరి ఉద్యోగ విశేషాలు వివరించుకుంటూ గడిపినా, చివరికి వాడికి సెండాఫ్ చెప్పేటప్పుడు మాత్రం గుమ్మంలోకి వస్తుంటేనే వీడిమీద అనవసరంగా చెయ్యి చేసుకున్నానే అనే ఫీలింగ్ గుండెలో కలుక్కుమంటూనే ఉంది.

** ** **

"ఎందుకురా హఠాత్తుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చావ్?'' గుమ్మంలోకి వచ్చి రిసీవ్ చేసుకుంటున్న రామాన్ని గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాను.

నవ్వుతూ లోనికి దారితీశాడే తప్ప నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

అనుకోకుండా ఉన్నట్లుండి బయలుదేరి రావడంతోను, ఏ విషయమూ తెలియని సస్పెన్స్‌తో రాత్రంత నిద్ర లేకపోవడంతోనూ మనసంత చికాకుగా ఉంది.

అలానే వాలు కుర్చీలోకి వాలాను.

ఎదురుగా కుదురుగా కూర్చున్నాడు రామం.

అప్పటికీ వాడు పెదవి విప్పలేదు.

ఇక నాలో సహనం నశించి విసుగ్గా - "అవున్రా! వచ్చేశానుగా... ఇప్పుడైనా..." అంటూ అసలు విషయ మేమిటో చెప్పమని అడగబోయేటంతలో ట్రేలో రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమైంది సౌజన్య!

నా నిద్రమత్తు బడలిక అన్నీ ఒకేసారి గేదాట్లో కొట్టుకుపోయాయి.

అలానే నిలువు గు డ్లేసుకుని చూస్తున్న నా వంకే చూస్తూ చిరుదరహాసంతో - "ఇదిరా సంగతి! చూస్తున్నావుగా. ఆ రోజు నేను మీ విజయవాడ వచ్చినప్పుడు గుమ్మంలోంచి సౌజన్యను చూడడం, నీ చెంపదెబ్బ తినడంవరకూ నీకు తెలుసు గదా! తరువాత కాకినాడ వచ్చానే గానీ ఎందుకో నా మనసు మాత్రం నా వెంట రాలేదు. అక్కడే సౌజన్య చూపులలోనే చిక్కుకుపోయిందేమో ననిపించింది.

మాటల మధ్యలో నువ్వు నాకు చెప్పిన గుర్తుల ప్రకారం సౌజన్య వాళ్ళ పుట్టింటికి వెళ్ళి విషయాలన్నీ కూలంకషంగా మాట్లాడాను. వారి అనుమతితో, సౌజన్య సమ్మతితో, ఆమె అత్తవారి సహకారంతో మే మిద్దరం రిజిస్టర్ మేరేజ్ చేసుకోవడం జరిగింది.

ఆమె నా కన్నా వయసులో నాలుగు సంవత్సరాలు పెద్దది. అయినా నేను ఆమె పట్ల కామంతో గానీ, లేదా ఆమె గతంమీది జాలితో గానీ తీసుకున్న నిర్ణయం కాదు.



ఫోటో-ఎం.విశ్వనాథ్

పరిపూర్ణమైన అభిమానంతో, అనురాగంతో, ఆత్మీయతతో ఆమెను నా అర్ధాంగిగా స్వీకరించాను. ఆమెను మొదటిసారి చూసినప్పుడు అభిసారికలా ఎదురుచూసే ఆ చూపులకు అర్థం "ప్లీజ్! నన్ను లేపుకుపోరూ!" అన్నట్లుందని తమాషాగా చెప్పగానే, నా చెంప ఛెళ్ళు మనిపించావు. ఆపైన నా మనసులో మాట నీకు చెప్పుకోలేకపోయాను.

కేవలం నా ఆత్మసాక్షి చెప్పినట్లు నడుచుకున్నాను.

సంగతంత విన్నావు కదా! మరి నా అభిప్రాయాన్ని మన్నించి మమ్మల్ని అభినందిస్తావో, లేక ఇలాంటి పని నువ్వు చేస్తావని నే నూహించలేదంటూ నా రెండో చెంప గూడా వాయిస్తావో ఇక అంత నీ ఇష్టం" అంటున్న రామం వంకా, చెంప పగలగొట్టించుకుని మోడువారిన నా జీవన తరువుని తిరిగి చివురింపచేసిన దేవుడు ఆయనైతే, ఆ దేవుని మనసు నావైపు మళ్ళేలా అనుగ్రహించిన సూత్రధారులు మీరే అంటున్నట్లు చూస్తున్న సౌజన్య వంకా కనులలో ఆనందాశ్రువులు జాలువారుతుండగా, మార్చి మార్చి చూస్తూ మాటలలో పొదగలేని శతకోటి అభినందనల సుమాలను వాళ్ళపైకి చల్లాను. ★

# హామేషా తమాషా

డా॥ మహీధర నళినీ మోహన్

## సూది బాణం

బట్టలు కుట్టుకునే సూదిని ప్రేక్షకులకు అందించు. ఒక గుమ్మడికాయనో, ఆనపకాయనో బల్లమీద పెట్టి, ఒక గజం దూరంలో నిలుచుని, ఆ సూదిని ఆ కాయలో గుచ్చుకునేటట్లు విసరమని చెప్పు.

వాళ్ళు ఎన్నిసార్లు ప్రయత్నించినా, విసిరిన సూది కాయలో గుచ్చుకోకుండా అడ్డంగా తగిలి కింద పడిపోతూ ఉంటుంది.

తమకు సాధ్యం కాదని నీ మిత్రులు ఓటమిని అంగీకరించాక ఆ సూదిని నీవు తీసుకుని, దాని బెజ్జంలోకి ఒక అడుగు పొడుగు దారం ఎక్కించి, గురి చూసి విసురు. సూది వంకరలు తిరగకుండా, తిన్నగా వెళ్ళి కాయలో గుచ్చుకుంటుంది!

కిటుకు అంత బెజ్జంలోకి ఎక్కించిన దారంలో ఉంది. వాయు ప్రవాహం వల్ల సూది పక్కకి తిరిగిపోకుండా ఈ దారపు తోక పనికివస్తుంది. అన్నట్లు కొండముచ్చులకి అంత పెద్ద తోక ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదికి సులువుగా, సూటిగా దూకగలగడానికే.

తారాజువ్వకి ఈనె పుల్ల కట్టడం కూడా ఏరో డైనమిక్ స్టెబిలిటీ కోసమే. పుల్ల కట్టని జువ్వ [బోడి జువ్వ] గురి చూసి విడిచిన దిశలో వెళ్ళక పిచ్చెక్కినట్లు అటూ, ఇటూ అలంగం తొక్కుతుంది.

బల్లేనికి అంత పొడుగు కర్ర కట్టడం కూడా ఇందుకోసమే.

రాకెట్లకి పూర్వం పొడుగుపాటి వెదురుబొంగు కట్టి వదిలేవారు. దరిమిలా అది వీలుగా లేదని 'ఫిన్స్' ఉపయోగిస్తున్నారు స్థిరత్వం కోసం. ఈ ఫిన్స్ వల్ల రాకెట్టు తన చుట్టూ తాను తిరుగుతుంది. ఇందువల్ల స్థిరంగా ముందుకి వెళ్ళగలుగుతుంది. బాణానికి పక్షి ఈనెలు చేసే సాయం కూడా సరిగ్గా ఇదే. ★

